క్లుప్తంగా

సేవకు ప్రతిరూపం మదర్ థెరిస్సా



ఉండి పీహెచ్‌సీలో మదర్ థెరిస్సా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న లయన్స్ సభ్యులు

ఉండి: సేవకు ప్రతిరూపంగా, ప్రపంచానికి సేవను పరిచయం చేసిన మహనీయురాలు మధర్ థెరిస్సా అని లయన్స్‌క్లబ్ ప్రతినిధులు పేర్కొన్నారు. మంగళవారం మధర్ థెరిస్సా జయంతిని పురస్కరించుకుని ఉండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రోగులకు పండ్లు పంపిణీ చేసారు.ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ సునంద మాట్లాడుతూ మనకోసం మనం బతకడమే కాకుండా సాటి వారికి సాయం చేయడంలోనే నిజమైన మానవత్వం ఉందని ప్రపంచానికి చాటిచెప్పిన త్యాగమూర్తి థెరిస్సా అని అన్నారు. ఆమె సేవలకు గుర్తుగా ఆమెను ప్రపంచమంతా మధర్ అని కొనియాడుతున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రతినిధులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సిబ్బంది శ్రద్ధతో విధులు నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం బస్‌స్టేషన్, కార్గో విభాగాలు ప్రజలకు సౌకర్యవంతమైన సేవలు అందించేలా ఉన్నాయని ఏపీఎస్ఆర్టీసీ ఎండీ సీహెచ్ ద్వారకాతిరుమలరావు అన్నారు. భీమవరం డిపోలో ఏపీఎస్ఆర్టీసీ జిల్లా అధికారి ఎన్‌వీఆర్ వరప్రసాద్ ఆధ్వర్యంలో ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ద్వారకాతిరుమల రావు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేసే స్త్రీ శక్తి పథకం విజయవంతం చేయడం బాధ్యతగా తీసుకోవాలన్నారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించుటకు, బస్సుల జీరో ఫెయిల్యూర్ మీద గ్యారేజీలో అన్ని సెక్షన్ విభాగాల సిబ్బంది పూర్తిగా శ్రద్ధతో విధులు నిర్వహించాలన్నారు. అనంతరం పశ్చిమ గోదావరి జిల్లాలోని ఆదర్శ ఉద్యోగులకు నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో విజవాడ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌లు, ఎం.ఎఫ్, ఏ.ఎం.ఎఫ్ అసిస్టెంట్ మేనేజర్, ట్రాఫిక్, గ్యారేజి సూపర్ వైజర్లు, డ్రైవర్లు కండక్టర్లు ,గ్యారేజి సిబ్బంది, యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేసుకుంటే ఆరోగ్య సమస్యలు



భీమవరం జీవీఆర్ కళాశాలలో మాట్లాడుతున్న జడ్జి సురేష్‌బాబు

భీమవరం: శారీరక, మానసిక పరిపక్వత లేకుండా బాల్య వివాహాలు చేసుకుంటే ఆరోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని భీమవరం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) జి సురేష్ బాబు అన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించడానికి నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం భీమవరం గ్రంధి వెంకటేశ్వరరావు(జీవీఆర్) ప్రభుత్వ జూనియర్ కాలేజీలో నిర్వహించిన సదస్సుకు జడ్జి సురేష్‌బాబు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ప్రలోభాలకు ఆకర్షితులుగాకుండా లక్ష్యాన్ని నిర్దేశించుకొని చదువుపై దృష్టి పెట్టాలని ఎవరైనా బాల్య వివాహం చేసుకుంటున్నట్లు తెలిస్తే పోలీసులకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యేలేటి యోహాన్, ప్యానల్ న్యాయవాదులు బి సురేష్ కుమార్, ఎస్ సుధీర్, పి అంబేద్కర్, మీడియేషన్ న్యాయవాది కె విజయలక్ష్మి, జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి ప్రభాకర రావు, జిల్లా గిరిజన సంక్షేమశాఖాధికారిణి డి పుష్పరాణి, ఐసీడీఎస్ సీడీపీవో డి అనిల్ కుమారి, కాలేజీ ప్రిన్సిపల్ యు రామచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీలో జిల్లా మూడో ర్యాంక్



ఎన్.రాము, జువ్వలపాలెం

కాళ్ల: తాజాగా ప్రకటించిన డీఎస్సీ ఫలితాల్లో మండలంలోని జువ్వపాలేనికి చెందిన నడిమింటి రాము ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా మూడో ర్యాంకుతో పాటు ఒకేసారి నాలుగు ఉద్యోగాలకు అర్హత సాధించారు. మంగళవారం ఒక ప్రకటనలో రాము ఈ విషయం వెల్లడించారు. ఎస్ఏ ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా 3వ ర్యాంక్, పీఈటీ విభాగంలో జిల్లా 3వ ర్యాంకు, ఎస్‌జీటీ విభాగంలో జిల్లా 84వ ర్యాంకు, జోనల్ స్థాయిలో పీడీ విభాగంలో 9వ ర్యాంకు సాధించినట్టు తెలిపారు.

నిండా గుంతలు.. ఆపై బురద

అధ్వాన దారిలో అవస్థలు
- ఇప్పటికీ ఇబ్బందుల్లో జగనన్న కాలనీలు
- రోడ్లు లేక అల్లాడిపోతున్న ప్రజలు



పెదపుల్లేరులో అధ్వానంగా ఉన్న జగనన్న కాలనీ రోడ్లు



ఉండి పెదపేటకు అనుకుని ఉన్న జగనన్న కాలనీలో రోడ్ల దుస్థితి

ఉండి: గత ప్రభుత్వం చేసిన కార్యక్రమాలకు మేమేమీ సహకారం అందించం అన్నట్లు ఉంది కూటమి ప్రభుత్వం వ్యవహారం. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో నిలువనీడ లేని నిరుపేదలైన అర్హులను గుర్తించి వారికి జగనన్న లేఅవుట్లు ఏర్పాటు చేసి కాలనీలను సిద్ధం చేశారు. అయితే ఇప్పుడు ఆకాలనీల్లో కనీస వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం మోహం చాటేస్తుంది. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర వైపు అడుగులు వేస్తున్నాగానీ ఇంత వరకు జగనన్న కాలనీల్లో ఎటువంటి మౌలిక వసతులు కల్పించ లేదు. చివరకు కాలనీలోకి వెళ్లేందుకు పక్కా రోడ్లు కూడా నిర్మాణం చేయకపోవడంతో ఇపుడు కాలనీల పరిస్థితి దయనీయంగా మారింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి రాగానే అన్ని వసతులు కల్పించి కాలనీలను అద్భుతంగా మార్చాలనే ప్రణాళికలో ఉంది. అయితే జరిగిన పరిణామాలను బట్టి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం జగనన్న కాలనీలను పట్టించుకోవడమే మానేసారు. కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సదుపాయం సరిగా లేకపోవడంతో ప్రజలు రాత్రి వేళల్లో తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే మరికొన్ని ప్రాంతాల్లో విద్యుత్ దీపాలు లేక చీకట్లు అలముకోవడంతో రాత్రి వేళల్లో విషసర్పాల భయం ఓవైపు దొంగల భయం మరోవైపు వారిని ఆవరించి తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. తాగునీటికి ఇబ్బందులు రావడంతో చాలా మంది తాగునీటి కోసం కటకటలాడుతున్నారు. నియోజకవర్గంలో ఒకటి రెండు కాలనీలు తప్ప అన్ని కాలనీలకు చెందిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఎందుకింత నిర్లక్ష్యం:

గత ప్రభుత్వం మీకు మంచి చేసింది కాబట్టి మీకు మేము మంచి చేయం అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు కూటమి నాయకులు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు జగనన్న లేఅవుట్లుపై విషం చిమ్ముతూనే ఉంది. నియోజకవర్గంలోని ఏకాలనీలోను రోడ్లు వేసిన దాఖలాలు లేవు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో కురుస్తున్న వర్షాలకు రోడ్లు దారుణంగా తయారై కాలనీ వాసులు ఇంట్లో నుంచి అడుగు బయటపెట్టాలంటే బురదలో దిగాల్సిందే అన్నట్లు ఉంది. ఉండి పెదపేటను అనుకుని ఉన్న జగన్న లేఅవుట్‌లో అయితే అడుగు పెట్టేందుకే అవకాశం లేకుండా ఉంది. ఇంటికి సరుకులు తెచ్చుకోవాలన్నా, ఇంటి నుంచి బయటకు వెళ్లాలన్నా కాలనీ వాసులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వృద్ధులు అయితే మరింత ఇబ్బందిని ఎదుర్కొంటున్నారు. ఇంటివద్దకు కనీసం ద్విచక్రవాహనం వెళ్లేందుకు అవకాశం లేకపోవడంతో వాహనాలను దూరంగా పార్క్ చేసుకుని ఇంటికి వెళ్లాల్సి రావడంతో వాహనదారులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో ఇళ్ల నిర్మాణం లేక నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

లేఅవుట్లలో రోడ్లు వేయాలి



ప్రజలకు కనీస మౌలిక వసతుల కల్పన ప్రభుత్వాల భాధ్యత. కాబట్టి జగన్న కాలనీలకు ప్రజలు వెళ్లేందుకు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం కల్పించుకుని ముందుగా వారికి రోడ్లు వేయాలి. అప్పుడే కాలనీలు అభివృద్ధి చెందుతాయి. కూటమి నాయకులు పట్టించుకుని ప్రజలకు మంచి జరిగేలా చూడాలి.

పీవీఆర్‌కే ఆంజనేయరాజు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు, వాండ్రం.

నిర్లక్ష్యం తగదు



ఏ ప్రభుత్వం అయినా ప్రజలకు మౌలిక వసతులు కలిప్పించాలి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయాలు చేయకుండా పార్టీలకు అతీతంగా అందరికీ మంచి చేసారు. మంచి జరిగేలా కృషి చేసారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం కూడా మంచి చేయాలని జగనన్న కాలనీలను అభివృద్ధి చేయాలి.

గోగులమండ చినకృష్ణమూర్తి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ మేధావి విభాగం కన్వీనర్,సర్పంచ్ యండగండి

అక్రమంగా దొరగారి చెరువు మట్టి తరలింపు

- ప్రైవేటుగా విక్రయం
- తీర్మానం లేదు
- ఫిల్టర్ బెడ్‌ల వద్ద ఇసుక అక్రమ వినియోగం
- పట్టించుకోని కమిషనర్



స్థానిక ప్రధాన సెంటర్‌లోని దొరగారి చెరువు మట్టిని అక్రమంగా తరలిస్తున్న దృశ్యం



ఫిల్టర్ బెడ్‌ల వద్ద ఉన్న ఇసుకను అక్రమంగా రోడ్డు మార్గం కోసం వినియోగిస్తున్న దృశ్యం

ఆకివీడు: స్థానిక నగర పంచాయతీ పరిధిలోని ప్రధాన సెంటర్ వద్ద ఉన్న దొరగారి చెరువు పూడిక తీత పనులలో భాగంగా మట్టిని అక్రమంగా అమ్మేస్తున్నారు. లక్షలాది రూపాయల విలువైన మట్టిని ప్రైవేట్ వ్యక్తులకు విక్రయిస్తున్నారు. బ్రిటీస్ కాలం నుంచి మంచినీటి చెరువుగా ఉన్న దొరగారి చెరువును గత పాలకులు నిర్లక్ష్యం చేసి, నిరుపయోగంగా మార్చారు. దీంతో చెరువు నీరు వాడకానికి ఉపయోగకరంగా లేదు. చెరువు చుట్టూ ఆక్రమణలు ఉండటంతో చెరువులోకి వ్యర్థనీరు చొచ్చుకురావడంతో నీరు కలుషితమైపోయి నిరుపయోగమైంది. గత ప్రభుత్వంలో చెరువు అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సుమారు రూ. 60లక్షల మేర నిధులు కేటాయించింది. చెరువులో పూడికలు తీసి, చెరువు చుట్టూ ఫెన్సింగ్ వేసి, వాకింగ్ ట్రాక్ నిర్మించి, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని నిధులు కేటాయించారు. ఆ నిధులు ఏమేరకు వెచ్చించారో అధికారులకే తెలియాలి. అనంతరం మళ్లీ చెరువులో పూడిక తీత పనులకు నగర పంచాయతీ నిధులు కేటాయించారు. చెరువులోని వేలాది ట్రాక్టర్ల మట్టిని ప్రైవేటు వ్యక్తులకు విక్రయించడంతో పంచాయతీ ఆదాయానికి గండి పడినట్లు అయిందని పలువురు ఆరోపిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా చెరువు తవ్వకం పనులు జరుగుతున్నాయని విమర్శిస్తున్నారు. ఇదే ప్రాంతంలో ఫిల్టర్ బెడ్ వద్ద ఉన్న ఇసుకను చెరువులోకి రోడ్డు మార్గంగా వినియోగించి దుర్వినియోగం చేస్తున్నా నగర పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫిల్టర్ బెడ్‌లో వాడిన ఇసుకను గతంలో బయటకు సరఫరా చేసిన విషయమై కమిషనర్ చర్యలు తీసుకుని, ఇసుకను వెనక్కి మళ్లించుకున్నారు. ప్రైవేటు వ్యక్తులు ఇష్టానుసారం వినియోగిస్తున్నా చర్యలు లేవని పలువురు వాపోతున్నారు.

రోడ్ల వెంబడి బురద

స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులో మూలలంక కాల్వ దగ్గర నుంచి వైఎస్సార్ సెంటర్ వరకూ ట్రాక్టర్ల రాకపోకలతో మట్టి జారిపడి రోడ్డు బురద మయంగా మారింది. వర్షానికి బురద జారుడుబల్లలా తయారైంది. సాయంత్రానికి రోడ్డుపై ఉన్న బురద కొట్టుకుపోయింది. మళ్లీ ట్రాక్టర్ల ద్వారా చెరువులోని మట్టిని తరలిస్తే రోడ్లు బురదమయంగానే మారతాయని స్థానికులు వాపోతున్నారు. ట్రక్కుకు మించి బురద మట్టి వేసుకు వెళ్లడంతో రోడ్లపై బడి ప్రజలకు, వాహనచోదకులకు ఇబ్బందికరంగా మారింది. మట్టి ట్రాక్టర్లు కనీస నిబంధనలు పాటించడం లేదని స్థానికులు వాపోతున్నారు.

మట్టి గణపతినే పూజిద్దాం



మట్టి వినాయక ప్రతిమలను అందజేస్తున్న స్కూల్ డైరెక్టర్ ఆదిత్య కృష్ణంరాజు

భీమవరం: స్థానిక ఆదిత్య స్కూల్లో వినాయకచవితి సందర్భంగా విద్యార్థులు మట్టి గణపతులను తయారు చేశారు. మట్టి గణపతినే పూజిద్దాం, పర్యావరణాన్ని కాపాడుదాం అని స్కూల్ డైరెక్టర్ ఆదిత్య కృష్ణంరాజు తెలిపారు. పర్యావరణాన్ని కాపాడుకుంటూ మనం పండుగలను నిర్వహించుకోవాలని తెలిపారు. విద్యార్థులకు మట్టి గణపతి ప్రతిమలను అందజేశారు. టి.శ్రీనివాస్, బి.యుగసుధ, కె.వి. సత్యనారాయణ, ఎ.దుర్గాంబ పాల్గొన్నారు.

అమరావతి క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్ పోస్టర్ ఆవిష్కరణ



భీమవరం ఎస్ఆర్‌కేఆర్ కళాశాలలో పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ నాగరాణి

భీమవరం: ప్రపంచ దేశాల్లోని సాంకేతిక రంగంలో మన దేశానికి చెందినవారిదే ప్రధానపాత్రగా ఉంటుందని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. యువ సాంకేతిక నిపుణులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి పర్యవేక్షణలో జాతీయ స్థాయిలో చేపట్టిన ×అమరావతి క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్ 2025₹ సెమీఫైనల్స్ సెప్టెంబర్ 10వ తేదీన భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించనున్న నేపథ్యంలో మంగళవారం పోస్టర్ ఆవిష్కరణ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రభుత్వం యువ సాంకేతిక నిపుణులను ప్రోత్సహించేందుకు జాతీయ స్థాయిలోనే ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని దీనిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామ కృష్ణ నిషాంత్ వర్మ మాట్లాడుతూ ఈనెల 28న కళాశాల స్థాయిలో హేక్తాన్ పోటీలు జరుగుతాయని ఎంపికైన రెండేసి బృందాలు సెప్టెంబర్ 10న ఉభయగోదావరి జిల్లాలకు సంబంధించి తమ కళాశాలలో ప్రభుత్వం సెమీఫైనల్స్ ఏర్పాటు చేసిందన్నారు. కళాశాల డైరెక్టర్ ఎం జగపతిరాజు. ప్రిన్సిపల్ కేవి మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ తమ కళాశాలలో ప్రతి ఏటా వివిధ డిపార్ట్‌మెంట్స్ ఆధ్వర్యంలో హాక్తాన్ పోటీలు జాతీయ స్థాయిలో నిర్వహించి విద్యార్థులను తీర్చిదిద్దేందుకు వారిలో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఐటీ డిపార్ట్‌మెంట్ హెడ్ పి రవి కిరణ్‌వర్మ, టెక్నాలజీ సెంటర్ హెడ్ ఎస్ గోపాలకృష్ణమూర్తి పాల్గొన్నారు.

వినాయక చవితికి సర్వం సిద్ధం



భీమవరంలో వినాయక చవితికి అవసరమైన పండ్లు, కాయలు విక్రయాలు

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం మార్కెట్‌లో మంగళవారం వినాయక చవితి సందడి నెలకొంది. ఉదయం నుంచి విగ్రహాలు, పత్రి, పండ్లు, పూలు అమ్మకాలు మార్కెట్‌లో జోరుగా సాగాయి. ప్రకాశం రోడ్డుకు ఇరువైపులా పెద్ద ఎత్తున దుకాణాలు ఏర్పాటు చేసి పాలవెల్లులు, అలంకరణ సామగ్రి విక్రయించారు. పండ్లు, పూల ధరలు విపరీతంగా పెరగడంతో జనం బెంబేలెత్తారు. ఆపిల్‌కాయ రూ.40, బత్తాయి కాయ రూ.25, ఎలక్కాయ రూ.20 వరకు విక్రయించారు. దీంతో సగం సగం సరుకులు మాత్రమే కొనాల్సి వచ్చిందని, పువ్వుల రేట్లతే మారీ ఎక్కువగా ఉన్నాయని కొనుగోలుదారులు వాపోయారు. సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై వర్షం పడటంతో వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. ఇక పట్టణంలో పలు వార్డులు, ప్రధాన ప్రాంతాలు, ముఖ్య కూడళ్లలో వినాయక నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు భారీగా ఏర్పాట్లు చేశారు. ఆయా ప్రాంతాల్లో పందిళ్లు వేశారు. పెద్ద పెద్ద విగ్రహాలను తీసుకొచ్చారు. పట్టణమంతా వినాయక చవితి కోలాహలం నెలకొంది.



పట్టణంలోని పువ్వుల విక్రయాలు



పిఓపి వినాయకుని విగ్రహాలు

బాస్విని ట్రస్టు సేవలు అభినందనీయం



దివ్యాంగుడికి ట్రైసైకిల్ అందిస్తున్న సర్పంచ్ సుబ్బారావు తదితరులు

కాళ్ల: బాస్విని చారిటబుల్ ట్రస్టు పేరిట సర్పంచ్ సుబ్బారావు అందిస్తున్న సేవలు అభినందనీయమని మాజీ ఎంపీపీ ఆరేటి వెంకటరత్నప్రసాద్ అన్నారు. కాళ్ల మండలం దొడ్డనపూడి గ్రామంలో సోమవారం పలు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న సుమారు 700 మంది విద్యార్థులకు గొడుగులు బహుకరించారు. అనంతరం ఒక దివ్యాంగ యువకుడికి ట్రైసైకిల్‌ని గ్రామ సర్పంచ్ కొల్లి సుబ్బారావు దంపతులు అందజేశారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ తన సంపాదనలో కొంతభాగం బాస్విని చారిటబుల్ ట్రస్టు ద్వారా పేద ప్రజలకు సేవలు చేయడం సంతృప్తినిస్తుందన్నారు. అనంతరం సుమారు 3వేల మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి చర్యలు



మేకల దిబ్బ గ్రామంలో సీసీ డ్రెయిన్ పనులు పరిశీలిస్తున్న దృశ్యం

కాళ్ల: గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆనందపురం గ్రామ సర్పంచ్ కోలుకులురి ధర్మరాజు తెలిపారు. ఆనందపురం గ్రామపంచాయతీ పరిధిలో మేకలదిబ్బ గ్రామంలో సీసీ డ్రెయిన్ నిర్మాణ పనులను మంగళవారం గ్రామ సర్పంచ్ కొలుకులూరి ధర్మరాజుతోపాటు గ్రామ పెద్దలు పరిశీలించారు. జిల్లా పరిషత్ నిధులు రూ. 25 లక్షలు, మండల పరిషత్ నిధులు 4 నాలుగు లక్షలతో పాటు పంచాయతీ నిధులతో గ్రామంలో సీసీ డ్రెయిన్ నిర్మాణం పనులు చేస్తున్నట్లు సర్పంచ్ ధర్మరాజు తెలిపారు. దీనికిగాను జిల్లా పరిషత్ నిధులు కేటాయించిన జెడ్పీటీసీ పళ్ళిగోళ్ళ సోమేశ్వరావుకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామం అంత పరిశుభ్రంగా ఉంచాలనే లక్ష్యంతో పని చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పళ్ళిగోళ్ళ సోమేశ్వరరావు, మాజీ సర్పంచ్ బర్రె సీతారామస్వామి, గ్రామ పెద్దలు రుద్ర వెంకటరావు మోకా తాతయ్య వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

సమాజ అభివృద్ధికి దాతలు ముందుకు రావాలి

పాలకోడేరు: మండలంలోని శృంగవృక్షం ప్రభుత్వ ఉన్నత పాఠశాల నందు ర్యాంక్ సిలికాన్ అండ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ వారి సౌజన్యంతో నూతనంగా నిర్మించిన అదనపు తరగతి గదులను మంగళవారం ఉపసభాపతి, ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజు, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఇ.నారాయణ, ప్రధానోపాధ్యాయులు తోట కాశీ జగన్నాథరావు, గ్రామ సర్పంచ్ జంగా సూరిబాబు ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల కొరత సృష్టిస్తే కఠిన చర్యలు



ఉండిలో తనిఖీలు నిర్వహిస్తున్న ఏడీఏ జీవన్, ఏఓ శ్రీనివాస్

ఉండి: మండలంలో ఎరువుల కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని ఏడీఏ కే ప్రతాఫ్‌జీవన్ ఎరువులు, పురుగుమందులు దుకాణదారులను హెచ్చరించారు. మంగళవారం మండలంలోని కోఆపరేటివ్ సొసైటీ దుకాణం, మైనికా ఫెర్టిలైజర్స్, సద్గురు ఆగ్రో కెమికల్స్ దుకాణాలను తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ఎరువులు పురుగు మందులకు సంబంధించి కావాల్సినంత స్టాక్ మండలంలో ఉందని తెలిపారు. అయితే వ్యాపారులెవరైనా కృత్రిక కొరత సృష్టిస్తే మాత్రం వారిపై చర్యలు తీసుకోవడమే కాకుండా వారి లైసెన్స్ రద్దు చేయడం జరుగుతుందన్నారు. మండలానికి సంబంధించి కాంప్లెక్స్ ఎరువులకు ఎటువంటి కొరత లేదన్నారు. యూరియాకు సంబంధించి సొసైటీల్లో, ప్రైవేటు షాపుల్లో కలిపి 100 టన్నుల వరకు అందుబాటులో ఉంది కాబట్టి రైతులెవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అంతే కాకుండా ప్రస్తుతం ఉన్న స్టాకు అయిపోయే సరికి మరింత స్టాకు వస్తుందని అన్నారు.